సాక్షి నిర్మల్

మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



వైభవంగా సాయిబాబా జాతర

ఖానాపూర్‌లోని సాయిబాబా ఆలయ 27వ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం జాతర మహోత్సవం వైభవంగా సాగింది.

9లో▸



గాలివాన బీభత్సం

జిల్లాలోని వివిధ మండలాల్లో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. శనగ, మొక్కజొన్న, పెద్దజొన్న, మిర్చి, నువ్వు పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /20.0

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఉదయం పూట చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

యువత ఆదర్శంగా ఉండాలి



డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: రహదారి నిబంధనలు పాటిస్తూ యువత ఇతర వాహనదారులకు ఆదర్శంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా అదనపు రుసుము లేకుండా చాలాను చెల్లించిన 27 మంది గిరిజన యువకులకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే బీమా కంపెనీల నుంచి ఎలాంటి పరిహారం రాదన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, గ్రామీణ సీఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయసాహితీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 'అంబటి'

నిర్మల్: ఉదయసాహితీ సాహిత్య వికాస వేదిక రాష్ట్ర కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన కవి, రచయిత అంబటి నారాయణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తనను ఎన్నుకోవడంపై ఆయన సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి కార్యవర్గంలో ఉమ్మడి పది జిల్లాల నుంచి కవులు, రచయితలు, సాహితీవేత్తలు ఉన్నట్లు చెప్పారు. సాహిత్య వికాసం కోసం సంస్థ పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.

నేడు జిల్లాస్థాయి పోటీలు

నిర్మల్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఎస్సీఈఆర్టీ, రాష్ట్ర ఆంగ్లభాషోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి ఆంగ్ల డ్రామా, స్పెల్ విజార్డ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సోఫినగర్ బాలికల గురుకుల విద్యాలయంలో ఈ పోటీలు ఉంటాయన్నారు.

వైద్యాధికారులకు శిక్షణ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బందికి పెరినేటల్ మెంటల్ హెల్త్‌పై యూనిసెఫ్ సైకియాట్రిస్ట్ డాక్టర్ నితిన్ సోమవారం జిల్లా కేంద్రంలోని పాత డీఎంహెచ్‌వో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో ధనరాజు మాట్లాడుతూ గర్భసమయంలో, ప్రసవానంతరము ఏర్పడే మానసిక ఆరోగ్య సమస్యలను గుర్తించడానికి, కౌన్సిలింగ్, ఇతర సేవలు అందించడానికి అవసరమైన జ్ఞానాన్ని ఇవ్వడం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాస్, మెటర్నల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, జిల్లాలోని వైద్యులు, పర్యవేక్షక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్షలు పరిశీలన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాల, సహకార జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రయోగ పరీక్షలను జిల్లా నోడల్ అధికారి పరశురాం నాయక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట డెక్ మెంబర్లు డాక్టర్ వెంకటేశ్వర్లు, రవికిరణ్, ప్రిన్సిపాల్ భోజన్న, ఎస్‌వో నవిత, తదితరులు ఉన్నారు.

ఉన్నతాధికారుల బదిలీ

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో బదిలీలు కొనసాగుతున్నాయి. ఎమ్మార్వోలు, ఎంపీడీవోల బదిలీలు ఇప్పటికే పూర్తి చేయగా సోమవారం మరికొందరు జిల్లా అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జెడ్పీ సీఈవో ముప్పిరి సుధీర్ వికారాబాద్ జెడ్పీ సీఈవోగా బదిలీ కాగా నిజామాబాద్ జెడ్పీ సీఈవోగా విధులు నిర్వహిస్తున్న గోవింద్‌ను నిర్మల్‌కు బదిలీ చేశారు. నిర్మల్ డీపీవో శ్రీలత ఆదిలాబాద్‌కు బదిలీ కాగా ఆదిలాబాద్ డీపీవోగా ఉన్న పత్తకోటి శ్రీనివాస్‌ను నిర్మల్ డీపీవోగా బదిలీ చేశారు. నిర్మల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ సంపత్‌ను ఇర్లాకు బదిలీ చేయగా అతని స్థానంలో జి.లక్ష్మణరావును నిర్మల్‌కు కేటాయించారు. ఇదే శాఖలో ఎస్సైలుగా కొనసాగుతున్న రవికుమార్, రమేశ్ స్థానంలో వసంతరావు, బి.గజేందర్‌ను నిర్మల్‌కు కేటాయించారు.

అడిషనల్ ఎస్పీ బదిలీ

నిర్మల్: ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన అధికారుల బదిలీల్లో భాగంగా జిల్లా అడిషనల్ (అడ్మినిస్ట్రేషన్) ఎస్పీ వీరన్న బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా సోమవారం రాత్రి ఇచ్చిన ఉత్తర్వుల్లో వీరన్నను సైబరాబాద్ ట్రాఫిక్-2 అడిషనల్ డీసీపీగా బదిలీ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్) స్థానంలో కె.శివకుమార్ నియమితులయ్యారు.

కమలంపై ఆశలు!



- సిట్టింగ్ స్థానంపై అందరి దృష్టి
- టికెట్ కోసం పెరుగుతున్న పోటీ
- ఇప్పటికే ప్రచారంలో పలువురు
- తెరపైకి వస్తున్న మరికొందరు
- కీలకంగా మారిన ఎమ్మెల్యేల మద్దతు

నిర్మల్: పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఆదిలాబాద్ ఎంపీ స్థానానికి ఆశావహుల తాకిడి పెరుగుతోంది. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లో టికెట్ ఆశిస్తున్న వారిసంఖ్య ఎక్కువగా ఉంది. బీజేపీ సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు తనకే టికెట్ దక్కుతుందని బలంగా చెబుతున్నారు. మరోవైపు పార్టీ కొత్తవాళ్లకు చాన్స్ ఇస్తుందంటూ కమలం సీటు ఆశిస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే నిర్మల్ జిల్లా నుంచి భైంసా ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సినీనటుడు అభినవ్‌సర్దార్ సైతం తనకున్న పరిచయాలు, సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తున్నారు. తాజాగా రిమ్స్ వైద్యుడు రాహుల్‌నాయక్ పేరు తెరపైకి వచ్చింది. సంఘ్ పరివార్‌తో తనకున్న అనుబంధం మేరకు ఆయన టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. బీజేపీ ఆశావహుల జాబితాలో మాజీ ఎంపీ గోడం నగేశ్ పేరూ చర్చలోకి వస్తోంది. ఇక్కడ నలుగురు ఎమ్మెల్యేల మద్దతూ కీలకంగా మారడంతో ఆశావహులంతా వారిని ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు.

నిర్మల్ జిల్లాకు ఇవ్వాలని..

ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో నిర్మల్ జిల్లా నుంచి అభ్యర్థిని ప్రకటించాలన్న డిమాండ్ ఉంది. జిల్లా నుంచే ఇద్దరు పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారని, గత ఎన్నికల్లోనూ ఇక్కడి నుంచే ఎక్కువ ఓట్లు వచ్చాయన్న వాదన ఉంది. పలు సంఘాల ఆధ్వర్యంలోనూ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, తదితర పార్టీలన్నీ ఈసారి నిర్మల్ జిల్లా నుంచి అభ్యర్థులుగా అవకాశమివ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు భైంసాలో తీర్మానం కూడా చేశారు.

ప్రతిష్ఠాత్మకంగా..

ఆదిలాబాద్ బీజేపీకి సిట్టింగ్ స్థానం కావడం, నలుగురు ఎమ్మెల్యేలు ఉండటంతో పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ప్రస్తుత ఎంపీపై కొంత వ్యతిరేకత ఉందని, టికెట్ ఇతరులకు ఇవ్వొచ్చన్న ప్రచారం సాగుతోంది. కానీ.. ఈసారి ఎన్నికల్లోనూ తనకే టికెట్ దక్కుతుందని, కచ్చితంగా భారీ మెజార్టీతో గెలుస్తామని ఎంపీ సోయం బాపూరావు పేర్కొంటున్నారు. మరోవైపు పార్టీతో పాటు పలు ప్రైవేటు సర్వే సంస్థలు పార్లమెంట్ పరిధిలో పనిచేస్తున్నాయి.

ఆశావహులు

తెలంగాణ ఉద్యమకారుడిగా, భైంసా ఏఎంసీ చైర్మన్‌గా చేసిన జాదవ్ రాజేశ్‌బాబు, సినీనటుడు, బీజేపీ నేత కేతావత్ అభినవ్‌సర్దార్, రిమ్స్ వైద్యుడు, నేరడిగొండ మండలానికి చెందిన డాక్టర్ ఆడె రాహుల్, ఆదిలాబాద్ నియోజకవర్గానికి చెందిన శ్రీలేఖ, డాక్టర్ సుమలత, సిడాం రాంకిషన్, బోథ్ నుంచి మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, చాకేటి దశరథ్, ఖానాపూర్ నుంచి మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, సట్ల అశోక్, ఆసిఫాబాద్ నుంచి కొట్నాక విజయ్, తదితరులు బీజేపీ ఎంపీ టికెట్ ఆశిస్తున్న వారిలో ఉన్నారు.

ఎమ్మెల్యేల మద్దతు..

బీజేపీలో టికెట్ రావాలంటే పార్టీ, సంఘ్ పరివార్ ఆశీస్సులతో పాటు ఇటీవల గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాయల్ శంకర్, హరీశ్‌బాబు మద్దతూ అవసరం. వీరు ఎవరిపేరు చెబితే వారికే టికెట్ ఖాయమన్న వాదన ఉంది. ఆశావహులు ఎమ్మెల్యేల మద్దతు తమకే దక్కేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలు మాత్రం తమ మద్దతు ఎవరికన్నది ఇప్పటికీ బహిరంగపర్చలేదు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవనంలో నిర్వహించిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఫిర్యాదు చేస్తే సమస్య త్వరగా పరిష్కారం అవుతుందన్న నమ్మకంతోనే ప్రజలు వస్తారని, సంబంధిత జిల్లా అధికారులు సత్వరమే స్పందించి పరిష్కరించాలన్నారు. పరిష్కరించలేని అంశాలు ఉంటే ఫిర్యాదుదారులకు అక్కడే అవగాహన కల్పించాలన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఒక సమస్యపై ఫిర్యాదు దారుడు పలుమార్లు వచ్చే దుస్థితి ఉండకూడదన్నారు. మొత్తం 45 ఫిర్యాదులు అందాయని, వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మా భూమి ఇప్పించండి



కొండాపూర్‌లోని 123 సర్వేనంబర్‌లో ఉన్న 14 గుంటల భూమిలో నుంచి మా తాత గంగయ్య 11 గుంటల భూమిని 2003లో తోట లావణ్యకు విక్రయించాడు. మిగిలిన మూడు గుంటల భూమి మా నాన్న పేరు మీద ఉంది. దీనిని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపట్టారు. మమ్మల్ని బెదిరింపులకు గురి చేస్తున్నారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని మా భూమి మాకు ఇప్పించాలి. – రాకేష్, కొండాపూర్

ఎన్‌వోసీ నిరాకరించాలి



అశ్రఫ్ భట్టి అనే వ్యక్తి మార్చి 5, 2023 నుంచి ఏప్రిల్ 15 వరకు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎగ్జిబిషన్ నడిపించారు. పర్మిషన్‌కు సంబంధించి డీఎస్‌వో కార్యాలయంలో డబ్బులు కట్టలేదు. కరెంట్ బిల్లు చెల్లించలేదు. జిల్లా కేంద్రంలోని బస్‌డిపో ఎదురుగా మళ్లీ ఎగ్జిబిషన్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ యాజమాన్యం నుండి పాత డబ్బులు వసూలు చేయడమే కాకుండా ఎన్‌వోసీ నిరాకరించాలి.

– మహమ్మద్ ముజాహిద్ అలీ,
నిర్మల్ మున్సిపల్ కోఆప్షన్ మెంబర్

పెండింగ్ బిల్లులు ఇప్పించాలి

గత రంజాన్, బక్రీద్, వినాయకచవితి, దసరా పండగల కోసం నిర్మల్ మున్సిపల్ పురపాలక సంఘానికి ఫ్లెక్సీలు ప్రింటింగ్ చేయించి కట్టించడం జరిగింది. వాటికి సంబంధించిన బిల్లులకోసం మున్సిపల్ కమిషనర్‌ను కలిస్తే సంబంధం లేదని చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు ఇప్పించాలి.

– శ్యామ్, ఫ్లెక్సీ నిర్వాహకుడు, నిర్మల్

చెక్ డ్యాం తొలగించాలి

2021లో సాకేర చెక్ డ్యాం నిర్మించి స్వర్ణ ప్రాజెక్ట్ గేట్లు తెరచి నీరు వదలడం వల్ల వరద నీరు బయటికి వెళ్లకుండా నిర్మల్ పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీలోకి వచ్చి చేరుతోంది. తద్వారా కాలనీలోని ఇళ్లన్నీ నీట మునుగుతున్నాయి. అధికారులు స్పందించి చెక్ డ్యామ్ తొలగించి సమస్యకు పరిష్కారం చూపాలి.

– రవికుమార్, కాలనీవాసి

ఆశతో వచ్చి.. పడిగాపులు పడి





నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణి 11:35 వరకు కూడా ప్రారంభం కాలేదు. సుదూర ప్రాంతాలకు చెందిన వారు ఉదయం 9 గంటలకే చేరుకున్నారు. అర్జీలు స్వీకరించే వారులేక సుమారు 100 మందికిపైగా బాధితులు నిరీక్షిస్తూ కనిపించారు. చివరకు 11:37కు అదనపు కలెక్టర్ ఫైజాన్ హైమద్ వచ్చి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.

విజ్ఞానశాస్త్ర ఫలాలు సద్వినియోగం చేసుకోవాలి

- వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

నిర్మల్‌రూరల్: విద్యార్థులు విజ్ఞాన శాస్త్ర ఫలాలు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ వరంగల్ ప్రాంతీయ సంచాలకులు కె. సత్యనారాయణరెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని జేవీఎస్ఆర్ పాఠశాలలో వివిధ అంశాల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర బోధనతో పాటు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యత కూడా నేర్పాలన్నారు. పరిసరాల్లో చెత్త వేయకపోవడం, నీటి వృథా అరికట్టడం వంటి అంశాలే పర్యావరణ



మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణ

పరిరక్షణకు తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, సహాయ పరీక్షల అధికారి సిద్ధ పద్మ, జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్, ప్రిన్సిపాల్ మణికుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ ఎంపీడీవో సస్పెన్షన్

ఖానాపూర్: ఖానాపూర్ ఎంపీడీవో బాలె మల్లేశంపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2014–15 ఆర్థిక సంవత్సరంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఎంపీడీవోగా పనిచేసిన సమయంలో ఆసరా పెన్షన్లలో అక్రమాలు, అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల్లో భాగంగా స్టేట్ పీఆర్డీ ఎంప్లాయ్‌మెంట్ నుంచి సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ప్రస్తుతం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పరాంకుశం నరసింహస్వామి ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు.

మానవత్వంతో పనిచేద్దాం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క

- ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొద్దాం
- హైమన్‌డార్ఫ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి
- ఆదిలాబాద్ అభివృద్ధికి సీఎం కట్టుబడి ఉన్నారు
- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి లక్ష్యం
- గిరిజన దర్బార్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

సాక్షి,ఆదిలాబాద్: కల్మషం లేని అమాయకులైన ఈ ప్రాంత ప్రజల అభ్యున్నతి కోసం అధికారులు చిత్తశుద్ధితో పాటు మానవత్వంతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. అలాంటి వారిని చరిత్ర మరిచిపోదని వివరించారు. పోరాటవీరుడు కుమురంభీం, ఆదివాసీల అభ్యున్నతికి పాల్పడిన హైమన్‌డార్ఫ్‌ను ఇక్కడి ప్రజలు గుండెల్లో పెట్టుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. డార్ఫ్ తన కొడుకుకు లచ్చు పటేల్ అని పేరు పెట్టుకున్నారంటే ఈ ప్రాంతం, ఈ ప్రజలతో ఆయనకు ఏర్పడిన అనుబంధాన్ని మనకు తెలుపుతుందన్నారు. ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సీతక్క మొదట నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దర్బార్‌లో పాల్గొని ఆదివాసీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తనను ఇన్‌చార్జి మంత్రిగా నియమించినప్పుడు ఇక్కడికి రావడం అదృష్టంగా భావించానన్నారు. 'నేను పుట్టింది.. ఉద్యమంలో ఉంది ఇటువంటి ప్రాంతంలోనే.. ఇలాంటి ప్రజల కోసం నేను కాకపోతే ఇంకెవరు పనిచేయాలి అనుకున్నానని ఆమె అన్నారు.' ఈ దర్బార్‌లో కుమురంభీం, హైమన్‌డార్ఫ్ మహనీయుల చిత్రపటాలు ఉండాలని, వారి చరిత్రను శిలాఫలకాలపై రూపొందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పోరాటాల గడ్డ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. దర్బార్ ప్రాముఖ్యతను కూడా తెలియజేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు విద్య, వైద్య సదుపాయాలను మెరుగుపర్చాలని సూచించారు. పోడు పట్టాల సమస్యను పరిష్కరిస్తామన్నారు. రోడ్లు, రవాణా మార్గాలను అభివృద్ధి చేస్తామన్నారు. నీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. అందరి ఎజెండా ఒకటేనని, ప్రజల జీవితాల్లో మార్పునకు పాటుపడాలన్నారు. మేడారం తర్వాత మళ్లీ ఇక్కడికి వస్తానన్నారు. విజ్ఞప్తులను శాఖలు, గ్రామాల వారీగా పరిష్కరిస్తామని వివరించారు. ముందుగా ఆలయ సమీపంలో గోవడ్ వద్ద మేస్రం మహిళలతో సీతక్క ముచ్చటించారు.

దివ్యాంగ విద్యార్థులకు చేయూత



దివ్యాంగుడికి ట్రై సైకిల్ ఇస్తున్న అధికారులు (ఫైల్)

- జిల్లాలో పూర్తయిన గుర్తింపు సర్వే
- 1,473 మంది ఉన్నట్లు నిర్ధారణ
- అవసరమైన వారికి చికిత్స, వివిధ రూపాల్లో సహాయం

మామడ: దివ్యాంగ విద్యార్థులకు చేయూతనందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించింది. ఈమేరకు భవిత కేంద్రాల ఐఈఆర్పీలు దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు సర్వే నిర్వహించారు. గత డిసెంబర్ 19 నుంచి జనవరి 31 వరకు సర్వే చేశారు. జిల్లాలో 0–18 వయసు గల దివ్యాంగ విద్యార్థులను గుర్తించారు. వీరిలో ఇంటి వద్ద ఉండేవారు 116 మంది, ఐదేళ్లలోపు వారు 82 మంది, పాఠశాలలో చదువుతున్న వారు 1,473 మంది, బడి బయట ఉన్న వారు 33 మంది, భవిత కేంద్రాల్లో ఉన్నవారు 184 మంది ఉన్నట్లుగా లెక్క తేల్చారు. జిల్లాలోని 19 భవిత కేంద్రాల ఆధ్వర్యంలో 31 మంది రిసోర్స్



వివరాలు నమోదు చేస్తున్న రిసోర్స్‌పర్సన్

పర్సన్లు ఈ సర్వేలో పాల్గొన్నారు. శారీరక, మానసిక వైకల్యం కలిగిన వారి వివరాలను నమోదు చేశారు.


సర్వేలో నమోదు చేసుకున్న వారికి...

- ఈ సర్వే ద్వారా గుర్తించిన దివ్యాంగుల్లో అవసరమైన వారికి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీలను భవిత కేంద్రాల్లో నెలకు నాలుగుసార్లు వైద్యులు నిర్వహిస్తారు.
- దివ్యాంగులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఎస్కార్ట్ అలవెన్స్, రవాణా భత్యం, స్టైఫండ్, రీడింగ్ అలవెన్స్ 10 నెలల కలిపి రూ.1,200 పొందే అవకాశం ఉంటుంది.
- తొమ్మిది, పదో తరగతి చదివే దివ్యాంగ విద్యార్థులకు ఎన్ఎస్‌పీ(నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్) ద్వారా దరఖాస్తు చేసుకుంటే రూ.9 వేల నుంచి రూ.14 వేల వరకు ఉపకార వేతనాలను పొందే అవకాశం ఉంటుంది.
- దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అవసరమైన ఉపకరణాలు ఉచితంగా అందిస్తారు. వీల్‌చైర్, ట్రై సైకిల్ వినికిడి యంత్రాలు, బ్రెయిలి కిట్స్, పొందే అవకాశం ఉంటుంది.
- పదో తరగతి పరీక్షలలో దివ్యాంగులకు భాష పరీక్షలో ఒకటి మినహాయింపు ఉంటుంది. పరీక్షలో ఉత్తీర్ణత మార్కులు తగ్గిస్తారు. దివ్యాంగుల దినోత్సవం నిర్వహించి దివ్యాంగులకు ఆటల పోటీలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను అందిస్తారు. దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించేలా ప్రోత్సాహకాలు పొందే అవకాశం ఉంటుంది.

సర్వే ద్వారా మండలాల వారీగా గుర్తించిన దివ్యాంగుల వివరాలు

మండలం	గుర్తించిన దివ్యాంగులు
బాసర	39
భైంసా	214
దస్తురాబాద్	74
దిలావర్‌పూర్	56
కడెం	32
ఖానాపూర్	78
కుభీర్	134
కుంటాల	62
లక్ష్మణచాంద	72
లోకేశ్వరం	74
మామడ	44
ముధోల్	70
నర్సాపూర్(జి)	57
నిర్మల్	85
నిర్మల్ రూరల్	73
పెంబి	14
సారంగపూర్	96
సోన్	104
తానూర్	95
మొత్తం సంఖ్య	1,473

దివ్యాంగుల వివరాలు నమోదు..



జిల్లాలో దివ్యాంగుల గుర్తింపు సర్వే పూర్తి అయింది. ఈ సర్వే ద్వారా గుర్తించిన వారికి అవసరమైన ప్రోత్సాహకాలు అందుకునే అవకాశం ఉంటుంది. దివ్యాంగ విద్యార్థులు వినియోగించుకోవాలి. రిసోర్స్ పర్సన్లు సర్వే నిర్వహించి పాఠశాలల్లో చదువుతున్న వారితోపాటు బడిబయట దివ్యాంగులను గుర్తించి పూర్తి వివరాలు నమోదు చేశారు.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

అన్ని రంగాల్లో ప్రోత్సాహం



దివ్యాంగులైన విద్యార్థులకు ఏటా దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి బహుమతులు అందిస్తాం. వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసే విధంగా భవిత కేంద్రాలలో కార్యక్రమాలు ఉంటాయి. వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేలా ఫిజియో, స్పీచ్ థెరపీ అందిస్తాం.

– ప్రవీణ్‌కుమార్, సెక్టోరియల్ అధికారి

ఉపాధి నైపుణ్యాలు పెంపొందించాలి

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులు చదువుల అనంతరం ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రతిభ కనబరిచేలా నైపుణాలు పెంపొందించాలని టాస్క్ సమన్వయకర్త రమేశ్ అన్నారు. సోమవారం టాస్క్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని దీక్ష డిగ్రీ కళాశాలలో మహేంద్ర ప్రైడ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వివిధ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాలు పెంపొందించేలా శిక్షణ అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గ్రూప్ డిస్కషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, రెస్యూమ్ బిల్డింగ్ స్కిల్స్ వంటి వాటిపై తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు. ఈ నెల 12 నుండి 17 వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మెంగ శ్రీధర్, డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, సమన్వయకర్త లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ



ప్రశంసపత్రం అందుకుంటున్న అనుష్క

భైంసాటౌన్: తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ సైన్స్ డే జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీల్లో భైంసాకు చెందిన విద్యార్థిని అనుష్క ద్వితీయ బహుమతి పొందింది. ఈమేరకు ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి విద్యార్థిని అభినందించి బహుమతి అందజేశారు. అలాగే పాఠశాల డైరెక్టర్ సిందే ప్రేమానంద్, కరస్పాండెంట్ ఎం.శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సిందే సాయినాథ్, ట్రస్మా గౌరవ అధ్యక్షులు జాదవ్ పుండలిక్ రావుపాటిల్, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో ఫారెస్ట్ అధికారులు

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో కలపను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్వో వాహబ్ అహ్మద్ తెలిపారు. తమకు అందిన సమాచారంతో కనుగుట్ట గ్రామానికి చెందిన నవ్వ శ్రీనివాస్ ఇంట్లో సోమవారం సోదాలు నిర్వహించగా అక్రమంగా నిల్వఉంచిన రూ.లక్ష విలువ గల కలప పట్టుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, కలపను స్థానిక ఫారెస్టు రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. టాస్క్‌ఫోర్స్ ఫారెస్టు సెక్షన్ అధికారి గులాబ్, ఎఫ్‌బీవోలు సజన్‌లాల్, ప్రవీణ్, శ్యాంసుందర్ ఉన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

నిర్మల్‌టౌన్: హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియనాయక్ తెలిపిన వివరాలు.. జిల్లాకేంద్రంలోని రాంరావ్‌బాగ్‌కు చెందిన గంగోని గోపికి ఆయన మేనల్లుడు నిర్మల్ రూరల్ మండలం ముజ్గికి చెందిన వేల్పుల శివకుమార్ (23) గతంలో డబ్బులు ఇచ్చాడు. ఈక్రమంలో శివకుమార్‌కు గల్ఫ్ వెళ్లేందుకు వీసా వచ్చింది. 2019 జూన్ 1న గోపి ఇంటికెళ్లి తనకు ఇవ్వాల్సిన డబ్బులు అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. గోపి శివకుమార్ గొంతునులిమడంతో కిందపడిపోయాడు. అక్కడే ఉన్న శివకుమార్ చెల్లి ప్రవళిక అతన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి పెద్దనాన్న వేల్పుల సాయన్న ఫిర్యాదుతో నిర్మల్ ఎస్సై పద్మ కేసు నమోదు చేశారు. పరిశోధన నిమిత్తం అప్పటి సీఐలు జాన్ దివాకర్, శ్రీనివాస్ చార్జ్‌షీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చారు. పీపీ కల్వకుంట్ల వినోద్‌రావు 15 మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పుచెప్పారు.

ఆత్మీయ నేస్తం.. ఆహ్లాద కబుర్లు



పాతతరం రేడియో (ఫైల్)



ఆదిలాబాద్ ఆకాశవాణి రేడియోకేంద్రంలో ఇంటర్వ్యూ (ఫైల్)

- రేడియో తొలితరం సమాచార మాధ్యమం
- నేడు ప్రపంచ రేడియో దినోత్సవం

నిర్మల్‌ఖిల్లా: కమ్మని కబుర్లు చెప్పే ఆత్మీయనేస్తం.. సినిమా పాటలతో మైమరపించే సొగసరి..వందల, వేల మైళ్ల దూరంలో జరిగే విషయాలు వార్తల రూపంలో అందించేది. ఉదయాన్నే సుప్రభాతంతో నిద్రలేపి..సాయంత్రం జనరంజకంగా పలకరించి..రాత్రి కమ్మని పాటలతో రేడియో ప్రసారాలు ఆహ్లాదపరుస్తోంది. తొలితరం సమాచార మాధ్యమం. నేడు ప్రపంచ రేడియో దినోత్సవ సందర్భంగా 'సాక్షి'కథనం.

డెట్రాయిట్‌లో తొలి ప్రసారం

మొట్టమొదటి రేడియో వార్తా కార్యక్రమం 1920 ఆగస్టు 31న అమెరికాలోని డెట్రాయిట్‌లో నుంచి ప్రసారమైంది. కొద్ది రోజుల్లో రేడియో అనేది ప్రతి ఇంట్లో భాగమైంది. ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'పేరిట దేశప్రజలతో తన మనసులో మాటలు, అభిప్రాయాలను పంచుకుంటున్నారు.

రేడియో శ్రోతలకు అభిమానులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 100.2 ఎఫ్ఎం మనసునిండా.. పేరుతో ఆకాశవాణి ఆదిలాబాద్ పనిచేస్తుంది. జిల్లాలోని రేడియో శ్రోతలు ఇప్పటికీ ఇందులో ప్రసారమయ్యే సంగతులు, ముఖాముఖి, పాటలు, పల్లె ముచ్చట్లు వంటివి వింటున్నారు. ఆలిండియా రేడియో ఆధ్వర్యంలో ఆకాశవాణి రేడియో ప్రసారాలకు అభిమానులు ఉన్నారు. ప్రస్తుతం నేటి తరానికి అనుగుణంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ వంటి అంశాలపై నిపుణులతో ప్రసారం చేస్తున్నారు.

అధునాతన మార్పులు

రేడియో వినియోగం తగ్గుతోంది. సాంకేతికవిప్లవంతో కొత్త ఆవిష్కరణలతో టీవీలు, మొబైళ్ల రాకతో రేడియో శ్రోతలు క్రమంగా త గ్గుతున్నారు. ఎఫ్ఎంలు వచ్చాక కాస్త ఊపిరిపోసుకున్న రేడియో కూడా సాంకేతికతను అద్దుకొని భవిష్యత్తులో డిజిటల్ ప్రసారాలతో హల్‌చల్ చేయడానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఎఫ్ఎం రేడియో హవా కొనసాగుతోంది. ఎఫ్ఎం ద్వారా డీఆర్ఎం డిజిటల్ రేడియో ప్రసారాలు అందుబాటులోకి వచ్చాయి.



↑ ఈ చిత్రంలో ఉన్నది రొక్కడి భీమన్న. ఈయన వయసు 60 ఏళ్లు. నిర్మల్ బస్టాండ్ సమీపంలో చిన్నరేకుల డబ్బాలో రేడియో, టేప్ రికార్డర్లు బాగుచేసే రిపేరింగ్ షాపు ఉంది. సీనియర్ సిటిజన్లు, వృద్ధులు ఇప్పటికి నెలలో ఏడెనిమిది మంది తన వద్దకు రేడియో రిపేర్‌కు వస్తుంటారని చెబుతున్నాడు. తాను ఖాళీ సమయాల్లో రేడియోలో వచ్చే జానపద గేయాలు, పాత పాటలు వింటానని అంటున్నాడు.

రేడియో ప్రసారాలు వినాలి

ఆకాశవాణి ఆదిలాబాద్ రేడియో కేంద్రంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ అంశాలపై కార్యక్రమం ఉంటుంది. యువత, విద్యార్థులకు రేడియో ప్రసారాలు వినేలా ప్రోత్సహించాలి. ఆ దిశగా తల్లిదండ్రులు, ప్రభుత్వాలు కృషి చేయాలి.

– రమణగౌడ్ గొడిసెల, పోటీ పరీక్షల నిపుణుడు

వసంత పంచమి వేడుకలు షురూ

- అమ్మవారికి చీర సమర్పించిన ఎమ్మెల్యే రామారావు పటేల్
- ఏర్పాట్లు పరిశీలన



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పటేల్

భైంసా(ముధోల్): బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో సోమవారం వసంత పంచమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు ఆలయ ఈవో విజయరామారావు, ఆలయ వైదిక బృందం గోమాతకు పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్‌రామారావుపటేల్ సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని చీర సమర్పించారు. మొదటిరోజు ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న వేడుకలకు వచ్చే భక్తులకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లపై సమీక్ష

ఎమ్మెల్యే రామారావుపటేల్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా ఏటా ఎదురయ్యే లోపాలను ముందుగానే గుర్తించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనం ప్రశాంతంగా అయ్యేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రసాదాల కౌంటర్ల వద్ద తీసుకునే జాగ్రత్తలపై చర్చించారు. గోదావరి నది స్నాన ఘట్టాల వద్ద ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో యూనియన్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో టీహబ్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి సీతక్కకు వైద్యఆరోగ్య శాఖ యూనియన్ నాయకులు కలిశారు. రాష్ట్ర కోశాధికారి సుభాశ్ వైద్యసిబ్బంది సమస్యలను విన్నవించారు. మూడు నెలల నుంచి వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. దళారీ వ్యవస్థ తీసేసి ప్రభుత్వం నేరుగా వేతనాలు ఇవ్వాలని కోరారు. వెంటనే అధికారులతో మాట్లాడి చర్యలు చేపడుతామని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, యూనియన్ సభ్యులు మహేశ్‌రెడ్డి, అశ్విని, వీణ, సూర్యబంగారం, అమర్‌సింగ్, భానుప్రసాద్, వెంకటేశ్, ప్రతాప్, గంగాధర్, వేణు తదితరులు ఉన్నారు.

ఎంపీగా పోటీకి అవకాశం ఇవ్వాలి

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి తనకు ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ ఖానాపూర్‌కు చెందిన భైంసా ఎంఎల్ఎస్ పాయింట్ డీటీ మేస్రం బాబురావు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమక్షంలో మంత్రి సీతక్కకు సోమవారం వినతిపత్రం అందించారు. కేస్లాపూర్ దర్బార్ సందర్భంగా ఉట్నూర్ కేబీకాంప్లెక్స్‌లో హాజరైన మంత్రికి వినతిని అందజేశారు. ఆయన వెంట పలువురు ఆదివాసీ నాయకులు ఉన్నారు.

కామన్వెల్త్ చెస్ చాంపియన్‌షిప్ ఆర్బిటర్‌గా అరుణ్‌కుమార్



నర్సాపూర్(జి): మలేషియాలో ఈనెల 19 నుండి 28 వరకు జరగనున్న అంతర్జాతీయ కామన్వెల్త్ చెస్ చాంపియన్‌షిప్ ఆర్బిటర్ (చెస్ నియమాలను పాటించేలా చూసే అధికారి)గా భారత్ తరపున నర్సాపూర్(జి) వాసి గాడి అరుణ్‌కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన మహారాష్ట్ర నాగ్‌పూర్‌లోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో సార్జెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో ఇండియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, మలేషియా, సింగాపూర్, బంగ్లాదేశ్, శ్రీలంక, సౌతాఫ్రికా, మాల్టా దేశాలు పాల్గొంటాయి.

పరిహారం అందించాలని రైతుల ధర్నా



రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

తానూరు: ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు, రాళ్లతో కూడిన వర్షానికి హిప్నెల్లి గ్రామంలో మొక్కజొన్న, పెద్దజొన్న పంటలు నేలకొరిగాయి. బాధిత రైతులు నష్టపోయిన పంటలను పరిశీలించి పరిహారం అందజేయాలని కోరుతూ సోమవారం భైంసా–తానూరు రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆదివారం ఈదురుగాలులతో రాళ్లతో కూడిన భారీ వర్షానికి సుమారు 800ల ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న, పెద్దజొన్న పంటలు నష్టపోయాయని అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి ఏవో గణేశ్‌కు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. పంట నష్టపరిహారం అందించే వరకూ ధర్నా కొనసాగిస్తామన్నారు. నష్టపోయిన పంటలతో రహదారిపై నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై సందీప్, ఆర్ఐ మోహన్‌సింగ్ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పంట నష్టంపై సర్వేలు నిర్వహిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.

గ్రేహౌండ్స్ కమాండో మృతి..స్వగ్రామంలో విషాదం

- భూపాలపల్లి జిల్లాలో విధులు నిర్వర్తిస్తుండగా ఘటన
- మృతుడు ప్రవీణ్ స్వగ్రామం నార్నూర్ మండలం రాజులగూడ
- స్వగ్రామంలో అంత్యక్రియలు
- హాజరైన మంత్రి సీతక్క, అధికారులు



నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు



పాడే మోస్తున్న ఎస్పీ గౌస్ ఆలం, అధికారులు

నార్నూర్: నిరుపేద కుటుంబం. కూలీ పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొడుకులు ప్రయోజకులు కావాలని కష్టపడి చదివించారు. 2012లో పెద్ద కుమారుడు అడే ప్రవీణ్ పోలీసు ఉద్యోగానికి ఎంపిక కావడంతో స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. కానీవారి ఆనందం ఎక్కువకాలం నిలువ లేదు. విధి నిర్వహణలో కొడుకు ప్రాణాలు కోల్పోవడం కుటుంబంలో విషాదం నింపింది. నార్నూర్ మండలం రాజులగూడకు చెందిన అడే అనంత, నిర్మల దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. అనంత మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. పెద్ద కుమారుడు ప్రవీణ్(35) గ్రేహౌండ్స్ కమాండోగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈయనకు భార్య లత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుత్ తీగలు తగిలి..

మేడిగడ్డ ప్రాజెక్టు పరిశీలనకు సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లాల్సి ఉండగా ఆదివారం రాత్రి భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తురిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో గ్రేహౌండ్స్ పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి కమాండో ప్రవీణ్ మృతి చెందాడు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు మృతదేహాన్ని ఆదిలాబాద్ జిల్లాలోని స్వగ్రామం రాజులగూడకు తీసుకువచ్చారు. పోలీసు ఉన్నతాధికారులు నివాళులర్పించారు. ఎస్పీ గౌస్ ఆలం, 15వ బెటాలియన్ పోలీసు అధికారులు పాడే మోశారు. రాజులగూడ గ్రామం నుంచి మండల కేంద్రంలోని గాంధీచౌక్ వరకు అంతిమయాత్ర నిర్వహించారు. అధికారిక లాంఛనాలతో మాన్కాపూర్ శ్మశానవాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు.

ప్రముఖుల నివాళులు..

ప్రవీణ్ కుటుంబీకులను మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అటవీ ప్రాంతంలో వేట కోసం విద్యుత్ తీగలు అమర్చిన వారిని పట్టుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో 15వ బెటాలియన్ డీఎస్పీలు పీకేఎస్ రమేశ్, జి.రమేశ్, బి.రామ్, దయానంద్, ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, మాజీ సర్పంచ్ రాథోడ్ సావిందర్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో మెరుగైన వైద్య సేవలందించాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- ఉట్నూర్‌లో టీ–హబ్ కేంద్రం ప్రారంభం



టీ–హబ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన టీ–హబ్ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆసుపత్రికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాల్నారు. ఈ కేంద్రం ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జైవంత్‌రావు, జెడ్పీటీసీ చారులత రాథోడ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్, మండల అధ్యక్షుడు ఖయ్యూం, నాయకులు చంద్రయ్య, ఎక్బాల్, కలీం, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలువురు అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని గోటి గ్రామానికి చెందిన యువతి(23) ఆదివారం అదృశ్యమైంది. టూటౌన్ సీఐ అశోక్ కథనం ప్రకారం.. యువతి.. పట్టణంలోని నీలానగర్‌లో నివాసం ఉంటున్న తన చిన్నమ్మ ఇంటికి వచ్చింది. పట్టణంలో తన స్నేహితులను కలుస్తానని చెప్పి ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె రాత్రి అయినా తిరిగి రాలేదు. ఆమె కోసం గాలించిన ఆచూకీ లభించకపోవడంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వడ్యాల్‌లో ఒకరు



నవీన్

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌కు చెందిన ఉబ్బిది నవీన్ (39) అదృశ్యమయ్యారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ వెతికినా దొరకలేదు. సోమవారం మధ్యాహ్న సమయంలో సరస్వతి కెనాల్ వద్ద నవీన్ బైక్, చెప్పులు కనిపించాయి. భార్య లక్ష్మి ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కాంత్ తెలిపారు.

ఆలయానికి వచ్చి యువకుడు..



జగన్

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి దర్శనానికి కుటుంబ సభ్యులతో వచ్చిన గొర్లపల్లి జగన్ అదృశ్యమయ్యాడు. బాసర ఎస్సై గణేశ్ కథనం ప్రకారం.. భూపాలపల్లికి చెందిన గొర్లపల్లి జగన్ 13 మంది కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం బాసర వచ్చాడు. అమ్మవారి దర్శనం కోసం క్యూలో ఉన్నాడు. తన ఫోన్ కుటుంబీకులకు ఇచ్చి ఇప్పుడే వస్తానని బయటకు వెళ్లిన జగన్ తిరిగి రాలేదు. ఎక్కడా ఆచూకీ దొరకలేదు. కాగా, రెండునెలల క్రితమే జగన్‌కు వివాహం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి..

పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన భరద్వాజ్ ఇందల్‌సింగ్ ఈనెల 10న రాత్రి ఆయన ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఉదయం చూసేసరికి అక్కడ కనిపించకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల గాలించారు. ఆయనకు మతిస్థిమితం లేదని టూటౌన్ సీఐ అశోక్ పేర్కొన్నారు. తమ్ముడు కుందన్ సింగ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో సోమవారం కోతులు బీభత్సం సృష్టించాయి. ఓ ఇంట్లో వృద్ధురాలిపై కోతుల దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. కోతి దాడి చేసిన వీడియో సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. కోతుల బెడద అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమ్మె జయప్రదం చేయండి

ఎదులాపురం: కార్మిక, రైతుల సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు కోరారు. పట్టణంలోని లిక్కర్ డిపోను సోమవారం ఆయన సందర్శించి హమాలీ కార్మికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులు తమ హక్కుల కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దర్శనాల నగేశ్, అగ్గిమల్ల స్వామి పాల్గొన్నారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షలు పరిశీలన

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలను సోమవారం డీఈసీ అధికారులు పరిశీలించారు. కమిటీ సభ్యుడు పరుశురాం, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, లెక్చరర్ రవికిరణ్‌లు పరీక్ష నిర్వహణ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం..బేల మండలం భవానిగూడకు చెందిన వైశాలి (35)కి 15 ఏళ్ల క్రితం జైనథ్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన మడావి అశోక్‌తో పెళ్లి జరిగింది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఐదేళ్లుగా ఆమె మానసిక పరిస్థితి బాగోలేదు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. మృతురాలి సోదరుడు ఆకాశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

డీ 15 కాల్వకు నీరు విడుదల

సాక్షి స్పందన



విడుదలైన సరస్వతి కాలువ నీళ్లు

లక్ష్మణచాంద: మండలంలోని సరస్వతి కాలువ డీ–15 ఉప కాల్వకు నీరు సరఫరా చేసే తూము గేటు షటర్ మొరాయించింది. దీంతో ఆయకట్టుకు నీరందక గ్రామాల రైతుల పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. రైతుల ఆవేదనపై ఈనెల 11న సాక్షిలో 'తలాపునే గోదావరి–చేను చిల్క ఎడారి'శీర్షికన ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. సోమవారం డీ–15 ఉప కాల్వ తూము షెటర్‌ను జేసీబీతో పైకి లేపి కిందికి ఆయకట్టుకు నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు. డీ 15 ద్వారా న్యూవెల్మల్, బొప్పారం, పీచర, ధర్మారం, మల్లాపూర్, పార్‌పెల్లి గ్రామాల ఆయకట్టుకు నీరు సరఫరా అవుతుంది. దీంతో గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్యానికి తొలిమెట్టు

- గ్రూప్–4లో యువకుడి ప్రతిభ
- రాష్ట్రస్థాయిలో 537వ ర్యాంక్



తల్లిదండ్రులు, తమ్ముడితో కిశోర్

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని స్థానిక గాయత్రి టౌన్‌షిప్ ప్రాంతానికి చెందిన దాసరి కిశోర్ గ్రూప్–4 ఫలితాల్లో ప్రతిభచాటాడు. సివిల్స్ ప్రధాన లక్ష్యంగా పరీక్ష రాయగా జిల్లాస్థాయిలో 190 మార్కులతో 9వ స్థానం, రాష్ట్రస్థాయిలో 537 ర్యాంక్ సాధించాడు. బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ ఎన్ఐటీ వరంగల్‌లో పూర్తి చేసిన ఆయన నిరంతరం సాధనతోనే లక్ష్యాన్ని సాధించాడు కిశోర్. తండ్రి భూమన్న ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ తన ఇద్దరు కొడుకుల్ని ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. పెద్దకుమారుడు కిశోర్ గ్రూప్–4లో విజయం తన లక్ష్యానికి తొలిమెట్టుగా భావిస్తున్నట్లు 'సాక్షి'తో పేర్కొన్నాడు.

ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల మాక్‌డ్రిల్



పెండల్‌వాడ వద్ద మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న బృందాలు

జైనథ్: మండలంలోని కామాయి, సాంగ్వి(కె), పెండల్‌వాడ తదితర గ్రామాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సోమవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాలతో పెన్‌గంగా నదీ పరీవాహక ప్రాంతం చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో ఎలా స్పందించాలి? వరదలు వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలి? తదితర అంశాల గురించి వివరించారు. దీంతోపాటు నదీతీరంలో మాక్‌డ్రిల్ చేపట్టారు.

క్లుప్తంగా

భైంసారూరల్ సీఐగా శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ

భైంసారూరల్: భైంసారూరల్ సీఐగా శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వీరు సైబర్ సెక్యూరిటీవింగ్‌లో సీఐగా పని చేశారు. ఇక్కడ సీఐగా పని చేసిన నైలు ఐజీ ఆఫీస్‌కు అటాచ్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన సీఐకి సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

12మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 12మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, సాయికృష్ణ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడిన వారిని నిర్మల్ కోర్టులో హాజరు పరిచారు. 12మందికి రూ.9500 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సోన్: మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ బాలికల గురుకులంలో సోమవారం ఏనిమియా సే ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యురాలు స్వప్న పాల్గొని సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన పౌష్టికాహారం వివరించారు. అంతకుముందు 102 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు చేసి రక్తహీనతతో బాధపడే పలువురికి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్టులు సుచరిత, నిఖిత ఏఎన్‌ఎం అనిత, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐ, ఎస్సై బదిలీ

నిర్మల్‌టౌన్: నిర్మల్ సర్కిల్ పరిధిలోని ఎక్సైజ్ సీఐ, ఎస్సైలను బదిలీ చేస్తూ రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సీఐగా పని చేసిన సంపత్‌కృష్ణ యాంచకు బదిలీ కాగా, ఎస్సై రవికుమార్ మహబుబాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆదిలాబాద్‌లో పని చేస్తున్న లక్ష్మణరావు సీఐగా, నిజామాబాద్ స్టేషన్‌లో పని చేస్తున్న సింధు ఎస్సైగా రానున్నారు.

సమస్యలను ప్రశాంతంగా పరిష్కరించుకోవాలి

లక్ష్మణచాంద: భార్యాభర్తలు తమ సమస్యలను ప్రశాంతంగా, స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవాలని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అనే స్వచ్ఛంద సంస్థ మేనేజర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బోరిగా గ్రామంలో గృహహింస చట్టంపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలను వరకట్నం పేరిట వేధిస్తే పడే శిక్షలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు గంగాధర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణపై అవగాహన

కడెం: మండలంలోని పెద్దూర్ గ్రామంలో సోమవారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంస్థ(ఈడీఐఐ) ఆధ్వర్యంలో మహిళలకు జీవనోపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. చేపల వలలు అల్లడం, చేపల పచ్చడి, ఎండుచేపల మార్కెటింగ్, చేపనూనె తయారీపై శిక్షణ ఉంటుందని ఈడీఐఐ మాస్టర్ శిక్షకులు దేవేందర్ నాయక్ పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఫుడ్ లైసెన్స్‌లతోపాటు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్కెటింగ్, సంస్థ తరఫున సహకారం ఉంటుందని తెలిపారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్ ఉన్నారు.

ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ

భైంసారూరల్: తెలంగాణ సాయుధ పోరాట సమయంలో చాకలి ఐలమ్మ చేసిన పోరాటం మరువలేనిదని రజక సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ సుంకెట పోశెట్టి అన్నారు. సోమవారం మండలంలోని మహాగాం గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పోశెట్టి, మాజీ సర్పంచ్‌లు అప్పాల రాకేశ్, చిన్నన్న, బీజేపీ నాయకులు రాజేశ్‌బాబు, రజక సంఘం అధ్యక్షుడు లింగన్న తదితరులు పాల్గొన్నారు.

కడెం ఇన్‌చార్జి ఎంపీవోగా రత్నాకర్‌రావు

కడెం: కడెం ఇన్‌చార్జి ఎంపీవోగా పెంబి ఎంపీవో రత్నాకర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఇక్కడ ఎంపీవోగా పని చేసిన ఉపేందర్ బదిలీపై జెడ్పీ కార్యాలయానికి వెళ్లారు.

సన్మానం

సోన్: మండలంలోని ఎంపీడీవో మోహన్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు వారిని ఘనంగా సన్మానించారు. ఎంపీవో ఖలీల్ హైమద్, ఐకేపీ ఏపీఎం గంగామణి, ఏపీవో మంజుల రెడ్డి, కృష్ణ, సంధ్య, ప్రకాశ్ పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా జాతర



బాబాకు పూజలు చేస్తున్న గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి



జాతరలో దుకాణాల వద్ద ప్రజల సందడి

- ఖానాపూర్‌కు తరలివచ్చిన వేలాది మంది భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయ 27వ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం జాతర మహోత్సవం వైభవంగా సాగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆదిలాబాద్‌కు చెందిన గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి, అర్చకులు రామకృష్ణశర్మ, శశిధర్‌శర్మ, మల్లేశ్ బృందం ఆధ్వర్యంలో సాయిబాబా మూలవిరాట్‌కు మహాకుంభాభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీ శివపార్వతులు, లక్ష్మీనారాయణుల కల్యాణ మహోత్సవం, మహా పూర్ణాహుతి, అన్నపూజ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్, ఆదిలాబాద్ మాజీ ఎంపీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేందర్, ప్రధాన కార్యదర్శి కొక్కుల ప్రదీప్, కోశాధికారి శేఖరయ్య, కమిటీ సభ్యులు పండితులతో కలిసి ప్రముఖులకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.

పోటెత్తిన జనం..

సాయిబాబా దర్శనానికి భక్తులు పోటెత్తారు. సుమారు 50వేల మందికి పైగా భక్తులు హాజరై సాయిబాబాను దర్శించుకున్నారు. స్థానిక కళాసమైక్య ఆధ్వర్యంలో సాంస్కృతిక భజనలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, కళాకారుల నృత్యాలు అలరించాయి. 50క్వింటాళ్ల పైచిలుకు బియ్యంతో మహా అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఉట్టికొట్టుడు, పల్లకీసేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఆవరణలో రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు దుకాణాలను ఏర్పాటుచేశారు.



శివపార్వతుల కల్యాణం వద్ద పండితులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

విగ్రహ ప్రతిష్ఠాపన

లోకేశ్వరం: మండలంలోని మొహళ గ్రామంలో ఇటీవల వీడీసీ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయం నిర్మించారు. సోమవారం ఆంజనేయుడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. వేదపఠనం, స్వస్తివచనం, గణేశారాధన, కేతుక బంధనం, మండపారాధాన, నవగ్రహ, వాస్తుయోగిని, భద్రమండల, హారతిప్రసాద వితరణను వేద పండితులు భగవన్‌జోషి ఆధ్వర్యంలో జరిపించారు.

షీటీంను సంప్రదించాలి

ఖానాపూర్: మహిళలు, బాలికలు వేధింపుల కు గురైతే ఆందోళన చెందకుండా డయల్ 100తోపాటు షీటీం నెంబర్ 87126 59550కు సంప్రదించాలని షీటీం సిబ్బంది పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని కేజీబీవీలో విద్యార్థులకు మహిళల రక్షణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సైబర్ మోసాల బారిన పడితే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రమాదేవి, రాధిక, తదితరులు ఉన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం

సోన్: మండలంలోని కడ్తాల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే పి.నిఖిత జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే. పోటీల్లో పాల్గొనేందుకు ఆ గ్రామ తాజా మాజీ సర్పంచ్ బర్మ లక్ష్మి రూ.ఐదు వేలు, అదే గ్రామానికి చెందిన మనుబోలు మదన్ అనే యువకుడు రూ.రెండు వేలను సోమవా రం విద్యార్థికి అందించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, వ్యాయామ ఉపాధ్యాయురాలు వెన్నెల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన శనగ, మొక్కజొన్న పెద్దజొన్న
- పరిహారం అందించాలని రైతుల వేడుకోలు



కోలూరులో పెద్దజొన్న పంట వద్ద రైతులు



ఎల్వి గ్రామంలో ఈదురుగాలులకు నేలకొరిగిన మొక్కజొన్న

తానూరు: మండలంలోని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన వర్షానికి శనగ, మొక్కజొన్న, పెద్దజొన్న పంటలు నేలకొరిగాయి. మొగ్లి, హిప్నెల్లి, హిప్నెల్లితండా, తానూరు, ఎల్వి గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలని హిప్నెల్లి రైతులు భైంసా–తానూరు రహదారి వద్ద రాస్తారోకో నిర్వహించారు.

838 ఎకరాల్లో పంట నష్టం

తానూరు మండలంలోని హిప్నెల్లి, మొగ్లి, మసల్గా తండా, కోలూరుతండా, కోలూరు, తానూరు గ్రామాల్లో రాళ్ల వర్షం కురిసింది. మండలంలో 838 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు. నష్టపోయిన పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

లోకేశ్వరంలో..

లోకేశ్వరం: మండలంలోని రాజూరా, మన్మద్, పోట్‌పల్లి(ఎం), లోకేశ్వరం, పుస్పూర్, హవర్గ, పిప్రి, అబ్దుల్లాపూర్, రాయపూర్‌కాండ్లీ, ధర్మోరా, పంచగుడి, ఎడ్దూర్, గడ్‌చాంద తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పంటలు నేలకొరిగాయి. మొక్కజొన్న, మిర్చి, నువ్వు, పుచ్చకాయ, శనగ, పొద్దుతిరుగుడు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.



ధర్మోరలో నేలకొరిగిన మొక్కజొన్న

పంట చేతికందే సమయంలో కురిసిన వర్షానికి రైతులకు తీరని నష్టం వాటిల్లింది.

కుభీర్‌లో..



కుభీర్ శివారులో నేలకొరిగిన మొక్కజొన్న

కుభీర్: గ్రామాల్లో ఆదివారం రాత్రికురిసిన అకాల వర్షం రైతులకు అపారనష్టం కలిగించింది. జామ్‌గాం, రాజురా, కుభీర్, పార్డి(కె), కస్రా, సోనారి, పల్సి, నిగ్వా, చాతా, మాలేగాం తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంటలు నేలకొరిగింది. కొంతమేర జొన్న, గోధుమ పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో సుమారు వంద ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.



పార్డి(కె) శివారులో..

ముధోల్‌లో..

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో వర్షానికి మొక్కజొన్న పంట దెబ్బతింది. కష్టపడి పండించిన పంటలు దెబ్బతినడంతో రై తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోఆరువేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా 80 ఎకరాల్లో నష్టపోయినట్లు ఏవో భాస్కర్ తెలిపారు.



ఎడ్‌బిడ్‌తండాలో పంట వద్ద బాధిత రైతు

‘భారత్‌బంద్ జయప్రదం చేయండి’



భైంసాలో మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

భైంసాటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న చేపట్టే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నూతన్ కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేశ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు.సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గంగామణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మురళీమోహన్, నవీన్, సాయికిరణ్, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: రైతులకు హక్కులు, పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) చట్టం, రుణమాఫీ తదితర సమస్యలు పరిష్కరించాలని ఈనెల 16న నిర్వహించే గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు గంగాధర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పుస్పూర్‌లో భారత్‌బంద్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ముత్తన్న, భోజన్న ఉన్నారు.

ముధోల్: గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూతన్‌కుమార్ అన్నారు. సోమవారం ముధోల్‌లో భారత్‌బంద్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.

అలేఖ్య కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్

ఖానాపూర్: అలేఖ్య హత్యకు కారణమైన నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో హత్యకు గురైన అలేఖ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న జయశీల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మహేందర్, సంతోశ్, అనిల్‌రావు, కిషన్, రవీందర్‌రెడ్డి, రుస్తుం, పరమేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలేఖ్య కుటుంబసభ్యులను వారి నివాసంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి బన్సీలాల్ రాథోడ్ పరామర్శించారు. ప్రభుత్వం అలేఖ్య కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ధర్మ సమాజ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు రామగిరి రవీందర్ అన్నారు. సోమవారం బాధిత కుటుంబాన్ని వారి నివాసంలో పరామర్శించారు. కార్యక్రమంలో షేక్ జాఫర్ అహ్మద్, అంజయ్య, సుదాకర్, రాజు, భూమేశ్, హరిప్రసాద్, ముత్యం, తదితరులు ఉన్నారు.

అలేఖ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాదిగ జాగృతి కన్వీనర్ నాతరి రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం బాధిత కుటుంబాన్ని వారి నివాసంలో పరామర్శించారు. అంజయ్య, మహారాజ్, రాజు, తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

- బాధిత కుటుంబానికి రూ.20వేలు అందించిన డీఆర్డీవో విజయలక్ష్మి



అశోక్ (ఫైల్)

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి చెందిన ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్(ఎఫ్ఏ) అశోక్ (35) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో ఇటీవల కడుపులో శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటికి రాగా ఇన్‌ఫెక్షన్‌తో కిడ్నీలు దెబ్బతిన్నాయని వైద్యులు తెలిపారు. సోమవారం ఉదయం పరిస్థితి విషమించి చనిపోయాడు. మృతుడికి భార్య సుమలత, కుమారుడు మైత్రేశ్, కుమార్తె నైష్టిక ఉన్నారు. అశోక్ మృతదేహానికి డీఆర్డీవో విజయలక్ష్మి నివాళులర్పించారు. భావోద్వేగానికి లోనైన ఆమె అండగా ఉంటా మని కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. తక్షణసాయం కింద రూ.20 వేలను అందజేశారు. అంత్యక్రియల్లో ఎంపీడీవో మోహన్, ఏపీవోలు దివ్యారెడ్డి, ప్రమీల, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మార్కండేయ స్వామి జయంతి



తానూరు: భోసిలో పూజలు చేస్తున్న నాయకులు



వద్యాల్‌లో ధ్వజస్తంభం వద్ద భక్తులు

తానూరు:మండలకేంద్రంతోపాటు భోసి గ్రామాల్లో సోమవారం మార్కండేయస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. రచ్చ భూమన్న, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు గంగుల చిన్నన్న, ఆలయ పూజారి నర్సయ్య, రాజు తదితరులు ఉన్నారు.

నిర్మల్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్, బంగల్‌పేట్, ఆదర్శనగర్ కాలనీల్లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఆ సంఘం సభ్యులు మార్కండేయుడి చిత్రపటానికి పూజలు చేశారు.

కుంటాల: మండలంలోని కల్లూర్, కుంటాల గ్రామాల్లో మార్కండేయ స్వామి జయంతి నిర్వహించారు. కల్లూర్ మార్కండేయ ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల కన్వీనర్ గంగాధర్ పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంతోపాటు చించాలలో పద్మశాలీల ఆధ్వర్యలలో మార్కండేయస్వామి జయంతి నిర్వహించారు. అభిషేకాలు, పూజలు, యజ్ఞం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

పెంబి: మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కేండేయ స్వామి జయంతి నిర్వహించారు. స్వామి చిత్రపటానికి పూజలు చేశారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో సోమవారం శ్రీ భక్త మార్కండేయ స్వామి జయంతి నిర్వహించారు. వేదపండితులు పాల్దె నరహరిశర్మ తదితరులు ఉన్నారు.

వద్యాల్ మార్కండేయస్వామి ఆలయంలో

లక్ష్మణచాంద: మండలంలోని వద్యాల్‌లో ఉన్న మార్కండేయస్వామి ఆలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా పద్మశాలి సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. సంఘం సభ్యులు సుదర్శన్, నరేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని సాయినగర్ శ్రీశివభక్త మార్కండేయ స్వామి ఈశ్వర ఆలయంలో మార్కండేయ మహర్షి జయంతి నిర్వహించారు. అర్చకులు పాపారావు పంచామృతాలతో అభిషేకం, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లు

మామడ: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం మామడలో ఆటోడ్రైవర్లు ధర్నా చేశారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో తమ ఉపాధి దెబ్బతిందని వాపోయారు. కుటుంబపోషణకు ఇబ్బంది పడుతున్నామని.. కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ.10వేలు అందించి ఆదుకోవాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు ప్రసాద్, షేక్‌అహ్మద్, రహీం ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆలయ వార్షికోత్సవం

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ గణపతి గుట్ట ఆలయ మొదటి వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఆలయంలో పూజలు నిర్వహించగా భక్తులు తరలివచ్చారు.

నాగోబాను దర్శించుకున్న నాయకులు

కడెం: ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మండలాధ్యక్షుడు మల్లేశ్, మాజీ అధ్యక్షుడు గొళ్ల వెంకటేశ్, రమేశ్, భూషణం తదితరులు ఉన్నారు.

భూమిపూజ

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్‌లో మల్లన్న ఆలయ ప్రాంగణంలో సోమవారం వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉపేందర్ జ్ఞాపకా ర్థం వారి కుటుంబసభ్యులు నూకల కవిత అందించిన విరాళంతో ట్యాంకు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

పనులు ప్రారంభం

కడెం: మండలంలోని లక్ష్మీసాగర్‌లో రూ.2.90లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రహరీ పనులను సోమవారం ఎంపీపీ అలెగ్జాండర్ ప్రారంభించారు. ఎంపీటీసీ న్యాతరి మల్లేశ్, బేబిరాజు, అంబేద్కర్ సంఘ నాయకులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో తెప్పోత్సవం

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లితోపాటు ఆయా గ్రామాల గోదావరి రేవుల వద్ద సోమవారం భక్తిశ్రద్ధలతో తెప్పోత్సవం నిర్వహించారు. పాడిపంటలు, ఇంటిల్లిపాదిని క్షేమంగా ఉంచాలని గోదా వరి మాతను వేడుకున్నారు.

తహసీల్దార్‌గా జానకి

లక్ష్మణచాంద: మండల నూతన తహసీల్దార్‌గా కె.జానకి నియమితులయ్యారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ శ్రీలత బదిలీపై వెళ్లారు. డీటీగా పని చేసిన గంగాధర్ బదిలీపై వెళ్లడంతో నూతన నాయబ్ తహసీల్దార్‌గా అబ్దుల్ అజీజ్ బదిలీపై వచ్చారు.

సన్మానం

కుంటాల: కుంటాల ఎంపీడీవోగా పని చే సి న దేవేందర్‌రెడ్డి మంచిర్యాలకు బదిలీ కా గా సోమవారం వా రిని సన్మానించారు. ఎంపీపీ గజ్జారాం, ఏవో సోమలింగారెడ్డి, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.